క్లుప్తంగా

పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి


వినతి పత్రం అందజేస్తున్న దళిత నాయకులు

దర్శి: దళితుల హక్కుల పరిరక్షణ కోసం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ డిమాడ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జీఓ నంబర్ 105,106 అమలు చేయాలని కోరుతూ మీకోసం కార్యక్రమంలో ఎంపీడీఓ హనుమంతరావు, కమిషనర్ మహేష్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న దళితుల జీవితాల్లో మార్పులు జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వ తేదీన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రాచపూడి జనరాజ్‌పల్లి జోసఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదిమలుపు రవి, దొంతులూరి కోటేష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా రిబకమ్మ


ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన రిబకమ్మ

త్రిపురాంతకం: మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీగా మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు-2 జి.రిబకమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. దీంతో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా ఉన్న రిబకమ్మకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెతో కార్యాలయ అధికారి వరప్రసాద్, సిబ్బంది రంగారెడ్డి ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయ అటెండర్ మృతి



వెంకటేశ్వర్లుకు నివాళులర్పిస్తున్న వీఆర్‌ఏలు

గిద్దలూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న పిక్కిలి వెంకటేశ్వర్లు (59) అనారోగ్యం కారణంగా సోమవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు ఓట్స్ ఆంజనేయులు వీఆర్‌ఏలతో కలిసి పూలమాల వేసి వెంకటేశ్వర్లుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వీఆర్‌ఏలు నాగరాజు, అల్లూరయ్య, బికారి సాహెబ్, హనుమంతు, వెంకటరామయ్య ఉన్నారు. విధి నిర్వహణలో వెంకటేశ్వర్లు అందరితో కలిసి మెలిసి ఉండేవాడని గుర్తుచేసుకున్నారు.

27న ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

మార్కాపురం రూరల్: మార్కాపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 27న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.నరేంద్రనాథ్ తెలిపారు. ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, పూర్తిచేసిన విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. తిరుపతికి చెందిన అమర్‌రాజా బాటరీస్, హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్, తోషిబా ఎలక్ట్రికల్స్, జనతా ఆటో సొల్యూషన్స్, శ్రీసిటీకి చెందిన ఏషియన్ పెయింట్స్, చెన్నైకి చెందిన రిడ్జ్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

పేస్ కాలేజీకి ఎన్‌పీటీఈఎల్ గుర్తింపు


ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్ చూపుతున్న సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీకి ఎన్‌పీటీఈఎల్ 'ఏఎం' ర్యాంకును ఐఐటీ మద్రాస్ బహూకరించింది. కాలేజీకి చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో గల్డ్ ఎలైట్ సర్టిఫికెట్లు సాధించారు. మొత్తంగా కాలేజీ నుంచి 1200 మందికిపైగా విద్యార్థులు సర్టిఫికెట్ పరీక్షకు హాజరవగా, 802 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 74 మంది గల్డ్ ప్లస్ ఎలైట్ సాధించారు. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆ వివరాలను కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ కో ఆర్డినేటర్ డాక్టర్ టీఆర్ చైతన్య, కాలేజీ కో ఆర్డినేటర్ షేక్ హీనా కౌసర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

జూనియర్ కళాశాల కొనసాగేనా?


వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కురిచేడు: మండలానికి గత ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. దాన్ని నిలబెట్టుకోవడంలో ఉపాధ్యాయులు, నాయకులు బాధ్యతగా వ్యవహరిస్తున్నారా? లేక కళాశాలను జారవిడుచుకుంటారా? అనేది ప్రతి ఒక్కరిలో ఉన్న ప్రశ్న. మండలంలో ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కాలేదు. మండలం నుంచి సుమారు 500-600 మంది విద్యార్థులు జిల్లాలోని దర్శి, పొదిలి, పల్నాడు జిల్లా వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్, డిగ్రీలు చదువుతున్నారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు 10వ తరగతితో తమ చదువులకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. 1992-2016 వరకు మాగుంట సుబ్బరామరెడ్డి జూనియర్ కళాశాల నిర్వహించారు. ఆ సమయంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల మంజూరు చేసేందుకు ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాలను సాకుగా చూసి మంజూరు చేయలేదు. ఆ తర్వాత ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాల కూడా నిలిచిపోవడంతో విద్యార్థులు తిరిగి ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంజూరు చేసిన జూనియర్ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులను తొలుత నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దానికి రెండు గ్రూపులకు కలిసి 80 మంది విద్యార్థులకు అవకాశం ఉంది. కనీసం 40 మంది విద్యార్థులు చేరినా కళాశాల నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది.

పదో తరగతిలో 580 మంది ఉత్తీర్ణత

మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, 6 ప్రైవేటు పాఠశాలల నుంచి ఈ ఏడాది 580 మంది విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. వారిలో కనీసం 80 మంది జూనియర్ కళాశాలలో చేరినా మండలానికి జూనియర్ కళాశాల శాశ్వతంగా నిలిచిపోయి పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. జూనియర్ కళాశాల ఏర్పాటు, దాని వలన కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన కల్గిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల కొనసాగింపుపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడంలో ఉపాధ్యాయులు, నాయకులు విఫలమయ్యారని చెప్పవచ్చు. మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఉప సర్పంచ్‌లు, సొసైటీ ప్రెసిడెంట్లు 46 మంది ఉన్నారు. నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు కలిగినవారు అన్ని పార్టీల నుంచి వందకుపైగా ఉన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, గురుకుల, కేజీబీవీల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖలోని ఉద్యోగులు మరో 200 మంది వరకు ఉంటారు. వీరంతా ప్రచారం నిర్వహించి ఉంటే నేడు ఈ దుస్థితి వచ్చేది కాదు. అంతే కాకుండా నాయకులు ఒక్కొక్కరు ఒక్కో విద్యార్థిని కళాశాలలో చేర్పించినా జూనియర్ కళాశాల నిర్విఘ్నంగా కొనసాగుతుంది. కాని ఆ దిశగా ఒక్కరు కూడా ఇప్పటి వరకు ఆలోచించిన దాఖలాలు లేవని చెప్పవచ్చు. పార్టీలకతీతంగా జూనియర్ కళాశాలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఈ విషయంలో ముందుండాల్సిన విద్యాశాఖ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అందరూ సమష్టిగా కృషి చేసి జూనియర్ కళాశాలకు విద్యార్థులను చేర్పించి కళాశాల కొనసాగేలా చూడాల్సిన అవసరం ఉంది.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే కేపీ పరామర్శ


మహేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన మహేష్‌రెడ్డి అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఇటీవల బైక్ ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మహేష్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని తాను ఎప్పటికీ విస్మరించనన్నారు. నియోజకవర్గంలో జగనన్న అభిమానులు అధికంగా ఉన్నారని, వారి అండదండలతో పార్టీ కార్యకర్తలకు పూర్తిగా అండగా నిలుస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట కౌన్సిలర్ మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలుగుళ్ల నరసింహారెడ్డి, బొర్రా కృష్ణారెడ్డి, పోతుగంటి పీరయ్య ఉన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలి మృతి


సుందరమ్మ (ఫైల్)

కొమరోలు: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అకాల మరణం చెందారు. మండలంలో తాటిచెర్లమోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సుందరమ్మ (54) అనారోగ్యంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. కాగా సుందరమ్మ స్వగ్రామం యర్రంశెట్టివానిపల్లె గ్రామం కాగా మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించారు.

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్ అంధకారం

● సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్


మాట్లాడుతున్న సెబ్ డీఎస్పీ దుర్గా ప్రసాద్

మార్కాపురం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై యువతకు దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్ కావాలనుకుంటే మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సెబ్ సీఐ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసయ్యే వారిలో యువతే ఎక్కువగా ఉండటం దురదృష్టకరమన్నారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారం అవుతుందన్నారు. సెబ్ ఎస్సై ఎంవీ గోపాలకృష్ణ మాట్లడుతూ యువత చదువుపైనే దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె మధుసూదన్, కరస్పాండెంట్ డి.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు ఎమ్‌వీ కృష్ణారెడ్డి, వీఆర్‌కె ప్రసాద్, డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, క్యాంపస్ సెల్ ఇన్‌చార్జి పవన్‌కుమార్, డాక్టర్ ఎం.శేషుకుమార్, డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బస్సు బస్టాండుకు వెళ్లాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మార్కాపురం టౌన్: ప్రతి బస్సు బస్టాండుకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు మార్కాపురం ఇన్‌చార్జి డీఎం కామేశ్వరి తెలిపారు. యర్రగొండపాలెం ప్రాంత ప్రజలు ఆర్టీసీ బస్సులను తమ గ్రామంలో ఉన్న బస్టాండులో నిలపడం లేదని డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసరుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు నుంచి ప్రత్యేక టీమ్‌ను తనిఖీ చేయాలని సోమవారం యర్రగొండపాలెంకు పంపినట్లు ఆమె తెలిపారు. టీమ్ ఇన్‌చార్జి ఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యర్రగొండపాలెం బస్టాండును పరిశీలించారు. తెల్లవారుజామున దూరప్రాంత సర్వీసులైన హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులను కూడా బస్టాండులోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సిబ్బందికి ఆదేశాలిచ్చారని కామేశ్వరి తెలిపారు.

మట్టి పరీక్షలతో ఉపయోగం


వితలాపురంలో మట్టి నమూనాలు పరిశీలిస్తున్న ఏఓ ప్రసాదరావు


మట్టి పరీక్షలు చేసే విధానం చూపుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకుంటే పంటలకు ఎంతో ఉపయోగాలు ఉంటాయని వ్యవసాయాధికారి కె. బుజ్జిబాయి అన్నారు. మండలంలో మద్దలకట్ట గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు మట్టి పరీక్షలపై సోమవారం అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన ఎర్ర వెంకట చెన్నయ్య పొలంలో మట్టి పరీక్షకు మట్టిని ఎలా తీయాలి, ఏ విధంగా ఎంత పరిమాణంలో తీయాలని రైతులకు డెమో చేసి వీఏఏలు చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేస్తే ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలో తెలుసుకోవచ్చని తెలిపారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మండల పరిధిలో 12 గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో 548 మట్టి పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. చాట్లమట్ల గ్రామంలో సాగు చేసిన పత్తి పంటను సందర్శించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. వీఏఏలు శ్రీకాంత్, లాలరవి, రైతులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

పొదిలి: మట్టి నమూనా పరీక్షలపై రైతులకు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి సోమవారం కంభాలపాడు గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ జైనులాబ్దిన్, ఉద్యానవన అధికారిణి సంధ్య మాట్లాడుతూ.. రైతులు తమ పంట పొలాల్లో విచక్షణా రహితంగా పురుగు మందులు వాడితే నేల సహజత్వాన్ని కోల్పోతుందని పేర్కొన్నారు. ఏ రకం భూములకు ఏ మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడాలో పరీక్షల ద్వారా నిర్ణయించుకోవచ్చన్నారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా శాస్త్రవేత్తలు, అధికారుల సలహా మేరకు ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలని సూచించారు. తద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గటంతో పాటు, నాణ్యమైన ఉత్పత్తి పొందవచ్చని తెలిపారు.

మట్టి పరీక్షలతో బహుళ ప్రయోజనాలు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని వితలాపురంలో సోమవారం రైతుల పొలాల్లో ఆయన మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల ఆధారంగా రైతులు తమ పొలంలో ఎలాంటి పంటలు సాగు చేసుకోవచ్చో తెలుసుకోవచ్చన్నారు. తద్వారా నేలల సారవంతాన్ని బట్టి సాగు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. భూమి స్వభావాన్ని బట్టి ఎలాంటి ఎరువులు వాడాలో ముందుగా తెలుసుకుంటే ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. మన నేలల్లో సేంద్రియ కర్బనం చాలా తక్కువగా ఉన్నందున, ప్రతి ఎకరా నేలలో కనీసం నాలుగు నుండి ఎనిమిది ట్రక్కుల సేంద్రీయ ఎరువు లేదా ఎరువు దిబ్బ ఎరువును వేయాల్సి ఉంటుందన్నారు. పైర్లు వేసిన పొలాల్లో కాకుండా ఖాళీగా ఉన్న పొలాల్లో మాత్రమే మట్టి నమూనాలు తీయాలన్నారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా రైతులు విచక్షణారహితంగా ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆయన వెంట వీఏఏ అశోక్, రైతులు ఉన్నారు.


మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ


ట్రైసైకిల్ అందిస్తున్న దివ్యాంగుల విభాగం నాయకులు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 7వ బ్లాక్‌లోని చాకలివారి వీధిలో నివాసముంటున్న తుంబేటి వెంకటేశ్వర్లుకు ట్రైసైకిల్ అందించారు. వెంకటేశ్వర్లు సుగర్ వ్యాధితో బాధపడుతుండగా, ఇటీవలే తన ఎడమ కాలును వైద్యులు తొలగించారు. ఆయన నడవడం ఇబ్బందిగా ఉండటంతో ట్రైసైకిల్ అందించినట్లు గోపాల్ రెడ్డి తెలిపారు. దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ట్రైసైకిల్‌ను ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.శేఖర్, రమణారెడ్డి, సురేంద్రకుమార్, రెహమాన్, వెంకటరమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి


నగదు బహుమతి అందిస్తున్న సునందిని, పక్కన ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పూలసుబ్బయ్య కుమార్తె సునందిని పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలోని మున్సిపల్ హైస్కూల్లో గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. పాఠశాలకు చెందిన డి.ఖలీనా(529 మార్కులు), రూపశ్రీ(503 మార్కులు), షేక్ షాదియా(495 మార్కులు)కు నగదు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఎర్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి



మార్కాపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ చందన

మార్కాపురం రూరల్: ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ చందన సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సృజన, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొనకనమిట్ల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గొట్లగట్టు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ నారాయణరెడ్డి సూచించారు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నాగంపల్లి యూపీ, గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కేజీబీవీ పాఠశాలలో ఎబేట్ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నాగంపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈఓ

హాస్టల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి ఈ.రాజేశ్వరమ్మ కోరారు. బేస్తవారిపేట ఎస్‌డబ్ల్యూఓ పరిధిలో ప్రీమెట్రిక్ వసతి గృహాలు 8, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు మూడు ఉన్నాయన్నారు. 3వ తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ నుంచి పీజీ చదివే విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ ఓన్ స్టడీ మెటీరియల్, హాస్టల్స్‌లో ట్యూటర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించాలి


విద్యాకానుక కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటనాయుడు

కొమరోలు: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తూ చక్కగా చదువుకోవాలని జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకటనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఉచితంగా విద్యాకానుక కిట్లు అందచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందచేస్తోందని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీలు రమణమ్మ, తిరుపతిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డాక్టర్ యదిద్యా

యర్రగొండపాలెం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ యదిద్యా కోరారు. సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక విద్యా వనరుల సమావేశం భవనంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని, పాఠశాలల్లోని లెట్రిన్‌లను రెండు పర్యాయాలు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు భోజనాలకు ముందు, టాయిలెట్‌కు వెళ్లిన తర్వాత చేతులు, కాళ్లు శుభ్రం చేసుకునే విధంగా విద్యార్థులకు అవగాహన పరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.ఆంజనేయులు, బి.మల్లా నాయక్, శ్యాముల్ జాన్, ఇందిరా ప్రసాద్, డీబీఎస్ఐ జిల్లా సమన్వయకర్త లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య


విద్యార్థులు, దాతలతో విద్యాశాఖ అధికారులు

తర్లుపాడు: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ డి.సుజాత విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి అయిపోగానే ఇంటర్‌లో చేర్పించాలని సూచించారు. పిల్లలకు అవసరమైన నోట్‌బుక్‌లు, పలకలు, పెన్నులు అందించారు. దాతలు విశ్రాంత పోస్టుమాస్టర్ నజీర్ అహ్మద్, ఎల్ఐసీ ఏజెంట్ సుబ్రహ్మణ్యంను ఆమె అభినందించారు. హెచ్‌ఎం షేక్ మౌలాలి, ఉపాధ్యాయుడు షెక్షావలి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.